క్లుప్తంగా

ఉపాధి హామీ పథకం మేట్‌లకు శిక్షణ

నాగాయలంక: స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం నాగాయలంక మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఎన్ఆర్ఈజీఎస్ మేట్‌లు (మేస్త్రిలు) విస్తృత శిక్షణ సమావేశం జరిగింది. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా చేయాలన్నారు. ఏపీఓ టీవీఎస్ ముత్యాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మస్టర్ నిర్వహణ, కొలతలు, మొబైల్ ద్వారా హాజరు, పని ప్రదేశపు ఫొటోల అప్‌లోడ్ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు.

ఏటిమొగ పాఠశాలకు బడిగంట బహూకరణ

ఏటిమొగ(నాగాయలంక): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌లో నివసిస్తున్న పూర్వ విద్యార్థిని లంకె లీలా భవాని వితరణతో రూ.3,200 విలువైన ఇత్తడి బడి గంటను బహూకరించారు. ఆమె తండ్రి వీర వెంకటేశ్వరరావు ద్వారా ఈ గంటను నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు బుధవారం ఎంఈఓలు టి.రామదాసు, ఎ.రామారావు చేతుల మీదుగా హెచ్ఎం జీవీఎస్ పెరుమాళ్లుకు అందజేశారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని యండకుదురు ఎకుషలేము చర్చిలో వృద్ధులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. చర్చి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాస్టర్ శీరం సిమోను ఆధ్వర్యంలో పాస్టర్ కె.యేసు ముత్యాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వృద్ధులు, వితంతువులకు శ్యాంకిశోర్‌నాయుడుదుప్పట్లు పంపిణీ చేశారు.

కరాటేలో విజేతలు 'కొమ్మారెడ్డి' విద్యార్థులు

బంటుమిల్లి: ఈ నెల 4వ తేదీన బాపట్లలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ -2024 పోటీల్లో బంటుమిల్లి కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూలు విద్యార్థులు విజేతలుగా నిలిచారని హైస్కూలు డైరెక్టర్ కొమ్మారెడ్డి శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారిచే నిర్వహించిన ఈ పోటీలలో 9 సంవత్సరాల విభాగంలో పి.యోక్షిత(4వ తరగతి), బి చాతుర్య(7వ తరగతి) మొదటి స్థానంలో నిలిచారన్నారు. సీహెచ్ మోహన్(7వ తరగతి) 12 సంవత్సరాల కటా విభాగంలో ద్వితీయ స్థానంలోను, జీఎస్ఎస్ హర్షిత్(7వ తరగతి) తృతీయస్థానాల్లో నిలిచారని తెలిపారు. వి ధాన్విక(ఒకటో తరగతి) ఆరు సంవత్సరాల కటా విభాగంలోను, కె.చరణ్య(5వ తరగతి), ఎండీ సయ్యద్ అన్వర్(5వ తరగతి) 10 సంవత్సరాల కటా విభాగంలో తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. విజేతలైన బాలబాలికలను కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని పలు ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. స్థానిక నోబుల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో చెస్‌లో చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.దేవి జాహ్నవి పెడన విన్సెంట్ పల్లోటి స్కూల్ విద్యార్థిని ఎస్.సాహితిపై విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. ఈమెకు నగదు బహుమతిని అందజేశారు. క్రికెట్‌లో నోబుల్ జూనియర్ కళాశాల జట్టుకు శ్రీ పాండురంగ మునిసిపల్ హైస్కూల్ జట్టుకు మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో శ్రీ పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించి నగదు బహుమతి గెలిచింది. వాలీబాల్‌లో నోబుల్ జూనియర్ కళాశాల జట్టు శ్రీ పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల జట్టు పోటీపడగా నోబుల్ జూనియర్ కళాశాల జట్టు విజయం సాధించింది. విజేతలకు ఈ నెల 9న నోబుల్ కళాశాల వ్యవస్థాపకుడు రాబర్ట్ టర్లింగ్‌టన్ నోబుల్ జయంతి సందర్భంగా జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులను అందజేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ తెలిపారు.

కర్రసాములో స్వర్ణపతకాలు సాధించిన బాలలు

చల్లపల్లి: దక్షిణ భారతదేశ పరిధిలో మొట్ట మొదటిసారిగా నెల్లూరులో నిర్వహించిన కర్రసాము పోటీల్లో చల్లపల్లి బాలలు స్వర్ణ పతకాలు సాధించారని మదర్ థెరిస్సా స్కూల్ ప్రిన్సిపాల్ ఆండ్రూ గోమ్స్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 4న కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కర్రసాము అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో మొదటి దక్షిణ భారత కర్రసాము చాంపియన్ షిప్ జరిగిందని తెలిపారు. ఈ టోర్నమెంటులో 300 మంది విద్యార్థులు పాల్గొనగా, తమ విద్యార్థినులు సీహెచ్ సాత్విక రెండు స్వర్ణ పతకాలు, కేఎల్ఎస్ లాస్యశ్రీ స్వర్ణ పతకం, రజత పతకం, సబ్ జూనియర్స్ విభాగంలో కూడా కేఎల్ఎస్ లాస్యశ్రీ స్వర్ణ పతకం, కాంస్య పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్, ప్రిన్సిపాల్ ప్రశాంతి గోమ్స్ అభినందించారు. ఇదే పోటీల్లో చల్లపల్లి మండలం రామానగరంలోని శ్రీచైతన్య స్కూలులో నాలుగో తరగతి చదువుతున్న మోటుపల్లి మనోజ్ఞ మాన్వి సబ్ జూనియర్ స్టిక్ ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్, స్టిక్ కటా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిందని ప్రిన్సిపాల్ డి.సురేష్ తెలిపారు.

సంక్షేమ పాలనతో సువర్ణాధ్యాయం

ఎమ్మెల్యే పేర్ని నాని



నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణాధ్యాయాన్ని లిఖించారని స్థానిక శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కర్రగ్రహారం శివారులో నగర ప్రజలకు కేటాయించిన జగనన్న లేఅవుట్ బి-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే పేర్ని నాని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా సొంత గూడు లేని దాదాపు 32 లక్షల మంది పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచే జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పరితపిస్తూ నివేశన స్థలాలు, పక్కా గృహాలు పెద్ద ఎత్తున మంజూరు చేశారన్నారు. దీంతో రాష్ట్రంలో కొత్త ఊళ్లే ఏర్పాటయ్యాయన్నారు. జగన్ పాలనలో రెండేళ్ల కరోనా వచ్చినా సంక్షేమ పథకాలు కొనసాగటంతో పాటు అభివృద్ధి పనులు పరుగులు తీశాయన్నారు. కర్రగ్రహారం శివారు జగనన్న కాలనీలో రూ.5 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కమిషనర్ బాపిరాజు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్, పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం

కోనేరుసెంటర్: వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడుతూ బుధవారం మండల పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బందరు శాసనసభ్యుడు పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి వంటి ముఖ్యమంత్రి మాకు ఉండటం తాము చేసుకున్న అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికలలో మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జ్ చండిక అజయ్, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి సీఎం జగనన్న పెద్దపీట

మేయర్ వెంకటేశ్వరమ్మ



39వ డివిజన్‌లో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విద్య, వైద్య సేవలు మెరుగుపరిచేందుకు పెద్దపీట వేస్తున్నారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 4, 39 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాలను ఆమె పర్యవేక్షించారు. 39వ డివిజన్ శిబిరం వద్ద ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు రెండో విడత కార్యక్రమంలో డివిజన్ల వారీగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు పథకం ద్వారా రోగులకు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, వైఎస్సార్ సీపీ 39వ డివిజన్ నాయకులు భోగాదుల సూరి, గోపిశెట్టి రాము, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉందాం

పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)



అచ్చయ్యవారిపాలెంలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము

పెడన: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసి చూపించారని, ఆయనకు మనమంతా అండగా ఉందామని వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. పెడన మండలంలోని జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఆయన విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు తిరుగుతూ నవరత్నాల గురించి తెలియజేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అటువంటి వ్యక్తిని మళ్లీ మనం సీఎంగా ఎన్నుకోవాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, పార్టీ నాయకులు రాజులపాటి అచ్చుతరావు, గరికపాటి వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, పామర్తి సాంబశివరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు మెరుగుపడేలా చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి
- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరం పరిశీలన



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

పెడన: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేసిందని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపుల శిబిరాలను రెండో విడతగా ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. పెడన 14వ వార్డు బంగ్లా స్కూలులో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. వైద్య సిబ్బంది నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలందించే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు ఆయా వైద్య సేవలు మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యులు గ్రామాల్లో పర్యటిస్తూ 104 ద్వారా సేవలను అందిస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రత్యేక శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తూ గ్రామీణ ప్రాంత వాసులకు వైద్య సేవలను చేరువయ్యేలా చేస్తున్నామన్నారు. గతంలో కంటే ఇప్పుడు ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. శిబిరంలో సుమారు 600 మందికిపైగా అవుట్ పేషెంట్లు తమ పేర్లను నమోదు చేయించుకుని ఆయా వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆయా వార్డు సచివాలయాల సిబ్బంది వైద్య సేవలను అందించారు.

గూడూరు ఎస్ఐగా వీర్రాజు బాధ్యతల స్వీకారం



గూడూరు: గూడూరు ఎస్ఐగా నియమితులైన ఐ. వీర్రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీర్రాజు ఏలూరు జిల్లా దెందులూరు నుంచి బదిలీపై గూడూరుకు వచ్చారు.

ఎస్ఐ పైడిబాబుకు సత్కారం

బంటుమిల్లి: బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎ.పైడిబాబును బుధవారం స్టేషన్ సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించిన వాసును కూడా సత్కరించారు.

సెక్యూరిటీ గార్డు నిజాయతీ

చల్లపల్లి: ఎస్‌బీఐ సెక్యూరిటీ గార్డ్ నిజాయతీ చాటుకున్నాడు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రాంగణంలోని ఏటీఎంలో బుధవారం రామానగరం గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి రాఘవయ్య రూ.5,500 నగదు డ్రా చేసే ప్రయత్నం చేసి, నగదు రాకపోవటంతో వెళ్లిపోయాడు. అంతలోనే క్యాష్ బయటకు వచ్చింది. ఇది గమనించిన బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్ డేవిడ్ బ్రాంచ్ మేనేజర్ భారతికి సమాచారం అందించాడు. బ్యాంకు మేనేజర్ భారతి రాఘవయ్య ను పిలిపించి, రూ.5,500 నగదును అందజేశారు. నిజాయతీ నిరూపించుకున్న సెక్యూరిటీ గార్డును బీఎం, సిబ్బంది, ఖాతాదారులు అభినందించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

చల్లపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఈఈ డి.కృష్ణ నాయక్ స్పష్టం చేశారు. చల్లపల్లి మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 1,951 గృహ సర్వీసులు, 256 వాణిజ్య సర్వీసులు, 35 పరిశ్రమల సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో 234 సర్వీసుల వారు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.6.93 లక్షలు జరిమానా విధించారు. నాలుగు సర్వీసుల వారు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి వారికి రూ.36వేలు జరిమానా విధించారు.

ఉత్సాహంగా సెంట్రల్‌జోన్ క్రీడలు



కబడ్డీలో ఎదురుమొండి బాలుర ఉత్కంఠ భరిత ఆటతీరు

నాగాయలంక: మండల పరిషత్, మండల విద్యాకుటుంబం ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా నిర్వహిస్తున్న మండల స్థాయి వార్షిక క్రీడల సెంట్రల్‌జోన్ ఆటల పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సందడిగా ప్రారంభమయ్యాయి. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈనెల 12వతేదీ వరకు కబడ్డీ, ఖోఖో, నూండీ 2ఇతర క్రీడలు విద్యా, సాంస్కృతిక పోటీలు జరుగుతాయని కమిటీ చైర్మన్, ఎంఈఓ టీవీఎం రామదాసు చెప్పారు. క్రీడా ప్రాంగణంలో తొలుత జాతీయ, క్రీడా పతాకాలను ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించి వివిధ క్రీడా కోర్టులను ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్‌లు తోట సాయిబాబు, ముమ్మారెడ్డి చంటి, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ సెల్ ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు, క్రీడల పోటీ కన్వీనర్‌లు దొక్కా నిరీక్షణరావు, చీర్ల నాగప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు కోసూరు పూర్ణచంద్రరావు, సుబ్బారావు, గాజుల లక్ష్మీప్రసాద్, టీఎస్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా మండల సెంట్రల్‌జోన్ క్రీడా పోటీలు

నాగాయలంక: విద్యా కుటుంబం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో మండల స్థాయి బాలల సెంట్రల్ జోన్ ఆటల పోటీలు సందడిగా జరుగుతున్నాయి. ఈ పోటీలలో చిన్నారులైన బాల బాలికలు ఉరిమే ఉత్సాహంతో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. బుధవారం కబడ్డీ, నూండీ(కుందుళ్లు) ఖోఖోలో హుషారుగా రెట్టించిన ఉత్సాహంతో విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రధానంగా కబడ్డీ ఆటలో దూసుకుపోయారు. 500 మందికి పైగా విద్యార్థులు ఈ క్రీడలకు తరలి వచ్చారు. ఎంఈవోలు టీవీఎం రామదాసు, ఎ.రామారావు పర్యవేక్షణలో పీడీలు, పీఈటీలు క్రీడలు నిర్వహించారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించండి

గూడూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాల రూపకల్పనలో వీఆర్వోలు, బీఎల్ఓలు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని గూడూరు తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్ఓలతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటు హక్కు దరఖాస్తులు స్వీకరించడానికి అవకాశం ఉందన్నారు. ఓటు హక్కు, ఓటరు సవరణ దరఖాస్తుల పరిశీలనలో ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించవద్దన్నారు. అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను ఆమోదించాలన్నారు. తద్వారా ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఎన్నికల విధులతో పాటుగా రెవెన్యూ శాఖాపరమైన విధులు కూడా పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. స్పందన అర్జీలు, ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వహించవద్దన్నారు. కార్యక్రమంలో డీటీలు కె.సాయి, వై.శివశంకర్, వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ లక్ష్మీ దమయంతికి ఘన సన్మానం



లక్ష్మీ దమయంతిని సన్మానిస్తున్న ఉపకులపతి జ్ఞానమణి

కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌గా పాల్గొన్న టి.లక్ష్మీ దమయంతిని అభినందిస్తూ బుధవారం విశ్వవిద్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీ నుంచి ఒక విద్యార్థిని రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. వర్సిటీలో ఎన్‌సీసీ విభాగానికి త్వరలోనే నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ డి.రామ శేఖర రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలల పాటు ఎన్‌సీసీ క్యాంపులలో పాల్గొని క్రమశిక్షణతో, నాయకత్వ లక్షణాలలో అగ్రగామిగా ఉండి రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న లక్ష్మీ దమయంతి విజయం యూనివర్సిటీ విద్యార్థులందరికీ ఒక ప్రేరణగా ఉంటుందన్నారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయ కుమారి మాట్లాడుతూ నిరంతర కృషి, క్రమశిక్షణ ప్రతి ఒక్కరినీ ఉన్నత స్థానానికి చేరుస్తాయన్నారు. రిజిస్ట్రార్ పి.వి.బ్రహ్మచారి మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంలో చేరడం వలన క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం లక్ష్మీ దమయంతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పదవుల కోసం పార్టీలు మారే మీరా మాట్లాడేది?

విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ

కోనేరుసెంటర్: రాజకీయాల్లో ప్రజల కోసం పనిచేయకుండా పదవుల కోసం పాకులాడుతూ పార్టీలు మారే వ్యక్తులు తమ నాయకుడు పేర్ని నానిపై విమర్శలు చేస్తుండటం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నిన్నటి వరకు తమ పార్టీలో ఉండి జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించిన మాదివాడ రాము నేడు జనసేన తీర్థం పుచ్చుకుని పేర్ని నానిని విమర్శించటం సిగ్గుచేటన్నారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన భూమిని నిర్మాణ సంస్థకు అప్పగించటంలో పేర్ని నాని పడిన కష్టం, చూపిన చొరవ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మాట్లాడుతూ బందరు ప్రాంత అభివృద్ధికి ఎంపీ బాలశౌరి ఏం చేశాడో చెప్పాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్ మాట్లాడుతూ బందరు ప్రాంత అభివృద్ధికి ముందు తరువాత కూడా చెప్పుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది తమ నాయకుడు పేర్ని నాని మాత్రమేనన్నారు. సమావేశంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు శీలం మారుతీరావు, మేకల సుబ్బన్న, సర్పంచ్ గాజుల నాగరాజు, మాజీ ఎంపీటీసీ పిప్పళ్ళ నాగబాబు, కార్పొరేటర్‌లు పల్లి శేఖర్, గాజుల నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

పాలసేకరణలో పురోగతి సాధించండి

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా రెండో దశలో ఎనిమిది మండలాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని పాల సేకరణలో మంచి పురోగతి సాధించాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో జగనన్న పాలవెల్లువ పథకంపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాలవెల్లువ రెండో దశలో ఎనిమిది మండలాల్లో ఏర్పాటు చేసిన 69 అమూల్ కేంద్రాల్లో పాల సేకరణ సరైన పురోగతి లేదని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ ఒక్కొక్క పాలకేంద్రాన్ని బాధ్యత తీసుకుని అక్కడి రైతులతో సమావేశం నిర్వహించి పాలుపోసేలా ప్రోత్సహించాలన్నారు. అమూల్ పాలకేంద్రాలకు పాలుపోస్తే మంచి ధర లభించటంతో పాటు దాని వలన భవిష్యత్తులో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను రైతులకు నిశితంగా వివరించాలన్నారు. ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ ఇతర అధికారులను సమన్వయం చేసుకుని ప్రతిరోజు పాలసేకరణలో పురోగతి సాధించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రెండు రోజులకు ఒకసారి పాలసేకరణ పురోగతిపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో గుర్తించిన 6,800 పాడి పశువులను సంబంధిత రైతులు కొనుగోలు చేసేందుకు పశువైద్యాధికారులు, ఏపీఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు, డీసీవో ఫణికుమార్, అమూల్ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ధీరజ్, ఎంపీడీవోలు, ఏపీఎంలు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీసీల సత్తా చాటుదాం

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
- టీడీపీ నిర్వహించిన జయహో బీసీ సభలో వేదికపై అగ్రకుల నాయకులు

మచిలీపట్నంటౌన్: రానున్న ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గంలో బీసీల సత్తా చాటుదామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం రాత్రి బైపాస్ రోడ్డులో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుదామన్నారు. బీసీలకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అండగా ఉంటారన్నారు. బీసీల కోసం చంద్రబాబు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చేందుకు రూపకల్పన చేస్తున్నారన్నారు.

బీసీ సభలో అగ్రకుల నాయకులదే హవా

టీడీపీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన జయహో బీసీ సభలో అగ్రకుల నాయకులు దర్శనమిచ్చారు. అగ్రకులాలకు చెందిన టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ ఇలా పలువురు అగ్రకులాలకు చెందిన నాయకులు సభా వేదికపై, వేదిక ముందు ఆశీనులై ఉండటం గమనార్హం.

పోలింగ్ కేంద్రాలు సందర్శించిన తహసీల్దార్

మోపిదేవి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీవిద్య సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మోపిదేవి, రావివారిపాలెం, వెంకటాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం సాయంత్రం ఆమె సందర్శించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు, విద్యుత్, ఫర్నిచర్, వాటర్, సప్లై, బాత్‌రూములపై ఆరా తీశారు.

పాముకాటుతో యువకుడు దుర్మరణం

కోడూరు: మినుము పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న సమయంలో పాముకాటుకు గురై యువకుడు మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన అప్పికట్ల రఘురామ్(38) బుధవారం ఉదయం 9 గంటల సమయంలో గ్రామంలోని మింగు ఆదినారాయణకు సంబంధించిన పొలంలో మినుము పంటకు పురుగు మందు పిచికారీ చేయడానికి ళ్లాడు. మందు ట్యాంకులో నీళ్లు పోస్తున్న సమయంలో విషసర్పం రఘురామ్ కాలుపై కాటు వేసింది. గమనించిన స్థానిక రైతులు హుటాహుటిన రఘురామ్‌ను అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రఘురామ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. రఘురామ్ మృతితో మాచవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.